క్లుప్తంగా

ఘనంగా రాజగోపురాల ప్రతిష్ట పూజలు


వాస్తు పూజ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: చినముషిడివాడలోని అలిమేలు మంగమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న తూర్పు, ఉత్తర రాజగోపురాల ప్రతిష్ట మహోత్సవాల్లో భాగంగా శనివారం విశేష పూజలు నిర్వహించారు. రాజగోపురాలపై ప్రతిష్టించే కళశాలకు పంచామృతాభిషేకం, వాస్తు హోమం,వాస్తు పురుష పూజ, రాత్రి కలశాలతో తిరువీధి, పంచ సయ్యాధివాసం నిర్వహించారు. ఆలయ అర్చకులు రామానుజమ్ తదితరులు పూజలను నిర్వహించారు.ఆదివారం పూర్ణాహుతి, కలశ ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

వైభవంగా నిత్య కల్యాణం


తలంబ్రాలు ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. ఉదయం 9.30 నుంచి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకులు శ్రీకాంత్ తదితరులు కల్యాణం నిర్వహించారు.

విస్టం కళాశాల విద్యార్థులకు అభినందన


సాధించిన ట్రోఫీలతో విద్యార్థులు

సింహాచలం: ఆనందపురం మండలంలోని సాయిగణపతి ఇంజినీరింగ్ కళాశాలలో ఇటీవల జరిగిన 2కె 23ఆటల పోటీల్లో పెందుర్తి విస్టం కళాశాల విద్యార్థులు వాలీబాల్, క్రికెట్ పోటీల్లో విజేతలుగా నిలిచారని కళాశాల ప్రిన్సిపాల్ జేమ్స్ స్టీఫెన్ తెలిపారు.ఈ సందర్భంగా కళాశాలలో విజేతలను ఆయన శనివారం అభినందించారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ బి.రమణారావు పాల్గొన్నారు.

భక్తులతో మర్యాదగా మెలగాలి


ప్రసాదాల కేంద్రంలో పరిశీలన చేస్తున్న డిప్యూటీ ఈవో సుజాత

సింహాచలం: సింహగిరిపై ప్రసాదాల విక్రయ కేంద్రంలో శనివారం సింహాచలం దేవస్థానం డిప్యూటీ ఈవో సుజాత తనిఖీలు నిర్వహించారు. ప్రసాదాల కోసం క్యూలో ఉండే భక్తులతో మర్యాదపూరకంగా మాట్లాడాలని సిబ్బందికి సూచించారు. అలాగే ప్రసాదాల పరిమాణాల కొలతలను వేయింగ్ మిషన్ ద్వారా తనిఖీ చేశారు. తేడా లేకుండా చూసుకోవాలని సూచించారు.

మొక్కల పెంపకం అవశ్యం

మల్కాపురం: ఇండియన్ కోస్ట్‌గార్డ్ 47వ రైజింగ్ డే సందర్భంగా కోస్టుగార్డ్ ప్రధాన కార్యాలయం (మల్కాపురం) పరిసరాల్లో శనివారం ఉదయం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో కోస్టు గార్డ్ అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. రైజింగ్ డేను పురస్కరించుకొని సుమారు 500 మొక్కలు నాటినట్లు అధికారులు తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతగానో దోహదపడతాయన్నారు. అనంతరం పరిసర ప్రాంతాల్లో స్వచ్ఛభారత్ నిర్వహించారు.చెత్తాచెదారాలు ఏరి దూరంగా తరలించారు.

కాపుల అభ్యున్నతికి సీఎం జగన్ పెద్ద పీట

- అన్ని రంగాల్లో ప్రాధాన్యం
- మంత్రి గుడివాడ అమర్‌నాథ్
- చీమలాపల్లిలో శ్రీకృష్ణదేవరాయ కాపు కల్యాణమండపం ప్రారంభం


హాజరైన కాపు సామాజిక వర్గ నాయకులు, ప్రజలు


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్

సింహాచలం: రాష్ట్రంలో కాపు సామాజిక వర్గానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేశారని రాష్ట్ర భారీ పరిశ్రమలు, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. జీవీఎంసీ 95వవార్డు చీమలాపల్లిలో రూ.1.60 కోట్లతో నిర్మించిన శ్రీకృష్ణ దేవరాయ కాపు కల్యాణమండపాన్ని శనివారం మంత్రి అమర్‌నాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కాపు సామాజిక వర్గ ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 175 ఎమ్మెల్యే సీట్లలో 31 స్థానాలు కాపు సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులకు జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చి గౌరవించారన్నారు. దీన్ని పరిశీలించి కాపు సామాజిక వర్గానికి ఎవరు గుర్తింపు ఇచ్చారో పెద్దలు ఆలోచన చేయాలన్నారు. కేబినెట్‌లో ఐదుగురు కాపుల కీలకమైన మంత్రిత్వశాఖలను జగన్‌మోహన్‌రెడ్డి అప్పగించారని చెప్పారు.అలాగే డిప్యూటీ సీఎం పదవి ఇచ్చారన్నారు.

ఇతరుల కోసం పార్టీ నడపడం దారుణం

మనం పెట్టిన రాజకీయపార్టీని ఎవరికోసమో నడపడం, ఆ పార్టీని భుజానవేసుకోవడం దారుణమన్నారు. ఈవిషయంపై కాపుసామాజిక ప్రజలంతా ఆలోచించాలని సూచించారు. పవన్‌కల్యాణ్‌కు పార్టీ నడిపే శక్తి, తపన, ఆశయం లేవన్నారు. టీడీపీని తన భుజాలపై మోస్తున్నారని ఎద్దేవా చేశారు. కాపులను తాకట్టు పెట్టేందుకు చూస్తున్నారని విమర్శించారు. అసలు కాపులకు పవన్ కల్యాణ్ చేసిందేమిటో చెప్పాలని ప్రశ్నించారు.

పోరాటాలు చేసిన చరిత్ర జగన్‌ది

వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 2011లో వైఎస్సార్ సీపీని స్థాపించి 2019లో అధికారంలోకి వచ్చారని గుర్తుచేశారు. ఎనిమిదేళ్లపాటు అనేక రకాలుగా ఇబ్బందులను ఎదుర్కొని పోరాటాలు సాగించారన్నారు. దేశచరిత్రలో ఎక్కడా లేని విధంగా 151సీట్లతో అధికారంలోకి వచ్చారన్నారు. ఆయన పంథాను రాజకీయాల్లోకి వచ్చిన వారు ఒక పాఠంగా నేర్చుకోవాలన్నారు. అంతే తప్పా ఎవరో ప్రయోజనాల కోసం జాతి ప్రయోజనాలు తాకట్టుపెట్టడం సమంజసం కాదన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ కలిసి లోకేష్‌ని భుజానికెత్తుకుని తిరుగుతారన్న విధానం కనబడుతోందన్నారు. కాపులంతా ఈ విషయాలను నిశితంగా పరిశీలించాలని, దీనిపై పెద్ద ఎత్తున చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. అభివృద్ధిని కాంక్షించే జగన్‌మోహన్‌రెడ్డి వెంట కాపులంతా ఉండాలని పిలుపునిచ్చారు.

మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ అన్ని వర్గాలు, కులాల సంక్షేమానికి పాటుపడుతున్న గొప్పనేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. విశాఖలోని ఎండాడలో కూడా కాపుల కోసం రెండువేల గజాలు ప్రభుత్వం కేటాయించిందని చెప్పారు. అనకాపల్లిలో కూడా కాపు కల్యాణమండపం నిర్మితం జరగాలని ఆకాంక్షించారు. పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మాట్లాడుతూ కల్యాణమండపం నిర్మాణానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సహకారం మరవలేమని తెలిపారు. నగర వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ కార్పొరేట్ కల్యాణమండపంగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, పెందుర్తి ఎంపీపీ మధుపాడ నాగమణి, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు నక్క కనకరాజు, జీవీఎంసీ 8వజోన్ జెడ్సీ మల్లయ్యనాయుడు, పార్టీ నాయకులు గొరపల్లి అప్పారావు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలి మృతి


రమణమ్మలు (ఫైల్)

సబ్బవరం: మండలంలోని ఆరిపాక గ్రామంలోని సబ్బవరం –చోడవరం రోడ్డులో శుక్రవారం ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో వృద్ధురాలు మృతి చెందింది.కుటుంబ సభ్యులు,స్థానికులు తెలిపిన వివరాలు.. ఆరిపాకకు చెందిన కొప్పాక రమణమ్మలు(65) శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో ఇంటికి ఎదురుగా ఉన్న దుకాణానికి అవసరమైన నిత్యావసర వస్తువులు తెచ్చుకునేందుకు వెళ్తుంది. అదే సమయంలో చోడవరం నుంచి విశాఖ వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీనితో రమణమ్మలు తల,ముఖానికి బలమైన గాయాలు కావడంతో సబ్బవరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.అధిక రక్తస్రావం కావడంతో చికిత్స పొందుతూ మృతి చెందారు.మృతురాలి పెద్ద కుమారుడు నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు.

ఐదుగురు పేకాట రాయుళ్ల అరెస్టు

సబ్బవరం: మండలంలోని బాటజంగాలపాలెం శివారులోని ఒక లే అవుట్‌లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై శుక్రవారం రాత్రి సీఐ రంగనాథం సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేయడంతో పాటు వారి నుంచి రూ.6,420 నగదు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిని శనివారం అనకాపల్లి కోర్టులో హాజరుపర్చారు. దాడుల్లో ఎస్ఐలు వెంకటేశ్వరరావు,ఎల్. సురేష్ పాల్గొన్నారు.

97వ వార్డులో కొనసాగుతున్న 'గడప గడపకు'..


ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: జీవీఎంసీ 97వవార్డులోని సుజాతనగర్, టీచర్స్ లేఅవుట్‌లో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం శనివారం కూడా కొనసాగింది. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఇంటింటికీ మూడున్నరేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో 97వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మెంటి మహేష్,కన్వీనర్లు నాగమణి, మహేష్, సోమునాయుడు, పార్టీ నాయకులు రాంబాబు, వర్మ,ఈశ్వరరావు, దారప్ప, కొత్తపల్లి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

8న నాయుడుపాలెంలో ఉచిత కంటి వైద్య శిబిరం

పరవాడ: మండలంలోని నాయుడుపాలెం పంచాయతీలో సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో ఈ నెల 8న ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మీసీతారామయ్య తెలిపారు. గ్రామ సచివాలయం ఆవరణలో ఆరోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. నాయుడుపాలెం పరిసర గ్రామాల ప్రజలు వైద్య శిబిరంలో పాల్గొవాలని కోరారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య


అరవింద్ స్వామి సెంథిల్ కుమార్(ఫైల్)

సింహాచలం: మద్యానికి బానిసైన యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పెందుర్తిలో చోటు చేసుకుంది. పెందుర్తి పోలీసులు తెలిపిన వివరాలు..పెందుర్తిలోని తమిళనాడు మార్కెట్‌లో పనిచేస్తున్న అరవింద్ స్వామి సెంథిల్‌కుమార్(26) తల్లి మదమ్మ సెంథిల్‌కుమార్‌తో కలిసి పెందుర్తిలో నివసిస్తున్నాడు. అతనికి మద్యం తాగే అలవాటు ఎక్కువగా ఉంది. ఈతరుణంలోనే ఈనెల 2వతేదీన తల్లితో గొడవపడి ఇంట్లో తనగదిలోకి వెళ్లి తలుపేసుకున్నాడు. మూడోతేదీ మధ్యాహ్నం వరకు బయటకు రాలేదు. దీంతో అనుమానం వచ్చితలుపులు బద్దలు కొట్టిచూడగా ఫ్యానుకు ఉరివేసుకుని కనిపించాడు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడి వైద్యులు మృతిచెందినట్టు ధృవీకరించారు. తల్లి మదమ్మ సెంథిల్‌కుమార్ ఫిర్యాదు మేరకు సీఐ అప్పారావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

భవిష్యత్తు తరాల కోసం ఆలోచించండి

జెడ్సీ మల్లయ్యనాయుడు


సింహాచలం రైల్వే స్టేషన్ వద్ద మాట్లాడుతున్న జెడ్సీ మల్లయ్య నాయుడు

గోపాలపట్నం: మన భవిష్యత్తు తరాలకు మంచి వాతావరణం అందించాలనే ఉద్దేశంతో తడి పొడి, ప్రమాదకర చెత్తను వేరు చేసి ఇవ్వాలని జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు సూచించారు. పారిశుధ్య నిర్వహణ, ప్లాస్టిక్ వినియోగం వల్ల అనర్థాలపై శనివారం సింహాచలం రైల్వే స్టేషన్ వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి, దుకాణాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నిషేధిత ప్లాస్టిక్ సంచులు వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీనిపై భారీ జరిమానాలు విధిస్తున్నామని, ఆ జరిమానాలకు బలికావద్దని సూచించారు. ఇందుకు అత్యున్నత న్యాయస్థానం సూచనలు చేసిందన్నారు. ప్లాస్టిక్ వల్ల భూమి కలుషితమవుతోందని తెలిపారు. భవిష్యత్తు తరాలు మంచి వాతావరణాన్ని, గాలి, నీటి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. వాతావరణ సమతుల్యత కోల్పోయి మానవ సమాజం ప్రమాదకర స్థితిలోకి వెళ్లిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ వాడకాన్ని స్వచ్ఛందంగా విడనాడి, ప్రత్యామ్నాయంగా నార, గుడ్డ సంచులు వాడాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ వెంకటరమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరిస్తాం

అధికారుల హామీ


రైతులతో మాట్లాడుతున్న జాతీయ రహదారుల విస్తరణ,రెవెన్యూ,ఇరిగేషన్ అధికారులు

సబ్బవరం: విశాఖ–రాయపూర్ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే విస్తరణరణ వల్ల గుల్లేపల్లి,మల్లునాయుడుపాలెం రైతులకు తలెత్తే సమస్యలను పరిష్కరిస్తామని జాతీయ రహదారుల సంస్థ లైజనింగ్ అధికారి నరసింగరరావు చెప్పారు. రైతుల సమస్యలపై వచ్చిన వార్తపై జాతీయ రహదారుల విస్తరణ అధికారులు,రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు స్పందించారు. శనివారం రైతులతో చర్చించారు. గ్రామంలోని గజ్జివాని చెరువు నుంచి ఆయకట్టు భూములకు చెరువు నీరు వెళ్లేలా కల్వర్టు నిర్మిస్తామన్నారు. అలాగే పంటలు గ్రామంలోకి తెచ్చుకునే విధంగా అండర్ పాత్ నిర్మిస్తామని చెప్పారు. కోర్టు వివాదాల్లో ఉన్న భూములకు మాత్రమే పరిహారం చెల్లించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో జాతీయ రహదారుల అధికారులు, ఇరిగేషన్ ఏఈ రామలక్ష్మణ, ఆర్ఐ వీరయ్య,వీఆర్వో రామకాసు తదితరులు ఉన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం


ఆరోగ్య కార్యకర్తలకు క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ భాస్కరరావు

సింహాచలం: క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అడవివరం ఆరోగ్యకేంద్రం డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ ప్రసాద్ నాయక్ తెలిపారు. అడవివరం ఆరోగ్యకేంద్రంలో శనివారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విశాఖలోని ప్రాంతీయ శిక్షణకేంద్రంలో శిక్షణ పొందుతున్న ఆరోగ్యకార్యకర్తలు, ఆంధ్ర వైద్యకళాశాల హౌసర్జన్లు,పర్యవేక్షక సిబ్బందితో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య కార్యకర్తలకు క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. డాక్టర్ ప్రసాద్ నాయక్ మాట్లాడుతూ భారతదేశంలో రొమ్ము, ఊపిరితిత్తులు, గర్భాశయ ముఖద్వార, పేగు, కాలేయ క్యాన్సర్లు ఎక్కువగా నమోదవుతున్నాయన్నారు. ఆరంభ దశలోనే గుర్తించడం ద్వారా వాటిని నివారించవచ్చని తెలియజేశారు. డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ భాస్కరరావు మాట్లాడుతూ క్యాన్సర్ చికిత్సలో ఎదురవుతున్న అవరోధాలను అధిగమించి వ్యవధి ఎక్కువ కాకుండా చికిత్స పొందే మార్గాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఆంధ్ర వైద్యకళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కల్యాణకుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ శివరామకృష్ణ, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పౌర్ణమి స్నానాలకు విస్తృత ఏర్పాట్లు


గ్రామ ప్రధాన కూడలి నుంచి తీరం వరకు ఏర్పాటు చేసిన విద్యుత్ తోరణాలు


సిబ్బందికి సూచనలు అందిస్తున్న సీఐ ఈశ్వరరావు

పరవాడ: మాఘపౌర్ణమి తీర్థమహోత్సవానికి ముత్యాలమ్మపాలెం సముద్ర తీరం ముస్తాబైంది. తీరంలోఆదివారం పుణ్యస్నానాలు ఆచరించడానికి ఏర్పాట్లు చేశారు. తీరం సమీపాన కొలువైన మాధవ స్వామి ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. గ్రామ ప్రధాన కూడలి నుంచి తీరం వరకు విద్యుత్ తోరణాలు ఏర్పాటు చేశారు. తీరంలో జాగరణ చేసిన భక్తుల కోసం శనివారం రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. దూర ప్రాంతాల నుంచి కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలపై వచ్చే భక్తుల కోసం ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేశారు. తాగునీరు, ఉచిత ప్రసాదాలను పంపిణీ చేయడానికి వీలుగా ప్రత్యేక స్టాల్స్ వేశారు. సముద్ర స్నానాలు ఆచరించే భక్తులకు సూచనలు అందజేయడానికి వీలుగా తీరంలో పోలీస్ పికెట్, గజ ఈతగాళ్లను నియమించారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా పటిష్ట చర్యలు తీసుకోవడంతో పాటు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పరవాడ సీఐ పి.ఈశ్వరరావు శనివారం రాత్రి సిబ్బందికి పలు సూచనలు అందజేశారు.


ముస్తాబైన మాధవస్వామి ఆలయం


మహిళా భక్తుల కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక గదులు

ఉక్కు ఉద్యమానికి కేంద్రం తలవంచాల్సిందే


మాట్లాడుతున్న ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్‌కౌర్

కూర్మన్నపాలెం: కార్మికులు చేస్తున్న ఉక్కు ఉద్యమ సెగకు కేంద్ర ప్రభుత్వం దిగిరాక తప్పదని, కార్మిక శక్తికి ప్రపంచదేశాలే తలవంచాయనే నిజాన్ని ప్రధాని మోదీ ప్రభుత్వం గ్రహించలేకపోతుందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. 723వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న కార్మికులనుద్దేశించి ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్‌కౌర్, పోరాట కమిటీనాయకులు ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె.అయోధ్యరామ్, ఏపీ స్టేట్ సెక్రటరీ పడాల రమణ మాట్లాడుతూ ఒక వైపు ఉక్కు ఉత్పత్తిని పరుగులు పెట్టిస్తూనే కర్మాగారాన్ని రక్షించుకునేందుకు కార్మికులు దీక్ష చేయడం గొప్ప విషయమన్నారు. స్టీల్ ప్లాంట్ పరిరక్షణపై తమకున్న పట్టుదల, ఉక్కు కార్మికుల ఐక్యతను చాటే విధంగా భవిష్యత్తు కార్యచరణ రూపొందిస్తున్నామన్నారు. కార్మిక వర్గ పోరాటాన్ని కేంద్ర ప్రభుత్వం చిన్నచూపు చూడడం తగదన్నారు.

ఆరోగ్యకరమైన విద్యా బోధన చేయాలి

ఆరిలోవ: విద్యార్థులకు ఆరోగ్యకరమైన విద్యాబోధన జరగాలని సెంచూరియన్ వర్సిటీ వీసీ జి.ఎస్.ఎస్.రాజు పేర్కొన్నారు. విశాఖ వేలీ స్కూల్‌లో శనివారం నగరంలో సీబీఎస్ఈ పాఠశాలల ఉపాధ్యాయులకు 'సీబీఎస్ఈ కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాం' పేరుతో రెండు రోజుల వర్క్ షాపు నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో ఉపాధ్యాయులు ఆరోగ్య సూచనలు పాటించాలన్నారు. ఉపాధ్యాయులు ఆరోగ్యంగా ఉండటంతో పాటు దాని గురించి అవగాహన ఉండాలన్నారు. విశాఖవేలీ ప్రిన్సిపాల్ ఈశ్వరి ప్రభాకర్ మాట్లాడుతూ ఈ ప్రోగ్రాం రెండు రోజులు జరగనుందన్నారు. తనతో పాటు స్టీల్ ప్లాంట్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎ.కె పాండే రిసోర్స్ పర్సన్లగా వ్యవహరిస్తున్నామన్నారు.

భక్తిశ్రద్ధలతో సహస్ర చండీ హోమం


దక్షవాటిలో నిర్వహిస్తున్న సహస్ర చండీ హోమం

సబ్బవరం: దేవీపురంలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం సహస్రాక్షి శ్రీరాజరాజేశ్వరీదేవి అమ్మవారి సన్నిధిలో శనివారం సహస్ర చండీ హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కెనడాకు చెందిన రమేష్ నటరాజన్,గాయత్రీ దంపతుల ఆధ్వర్యంలో దక్షవాటిలో ఈ హోమం నిర్వహించారు. అలాగే శనివారం సాయంత్రం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం వరకూ పూర్ణాహుతి నిర్వహించనున్నట్లు శ్రీవిద్య ట్రస్టు నిర్వాహకుడు ప్రభాకర్ తెలియజేసారు. అలాగే ఆదివారం పౌర్ణమి సందర్భంగా మహా మాఘీ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

14న రామచంద్రమ్మ పండగ


గోడపత్రిక ఆవిష్కరిస్తున్న నాయకులు

పరవాడ: వాడచీపురుపల్లి గ్రామంలో ఈ నెల 14న నిర్వహించనున్న శ్రీ రామచంద్రమ్మ పండగ గోడపత్రికను మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, పరవాడ వైస్ ఎంపీపీ బూస అప్పలరాజు శనివారం ఆవిష్కరించారు. పంచాయతీ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ శివలంక లక్ష్మి, నాయుడుపాలెం సర్పంచ్ వరలక్ష్మీసీతారామయ్య, మాజీ ఎంపీటీసీ కె.శ్రీరామ్మూర్తి, పీఏసీఎస్ చైర్మన్ బురదరాజు, కన్వీనర్ తాతాజీ, నాయకులు ఎం.అప్పారావు, ఎస్.గౌతం, సుధాకర్ పాల్గొన్నారు.